# పంతం....!

[ వజ్ఝల రామనరసింహమ్ ]

అప్పటే ఆఫీసునుంచివచ్చి, వాకిట్లోవున్న ఈజీ చైరులో కూలబడ్డాను...రోజూలాగ అరఘంట మూర్ఛపించకుండానే మాఆవిడ ఆవేళ స్వయంగా, తనంతటతానే వెండిగిన్నెతో వేడివేడి కాఫీ తెచ్చి ఇచ్చింది...'ఇవాళ ఏదో విశేషంవుంది మాఆవిడలో అని నాలో నేననుకొన్నాను...కాని, ఆవిశేషమనేది 'మనకు' మరేమీ ప్రమాదించేది కాదుగదా అని కాస్త భయపడవలసివచ్చింది...ఎందుకేం, లే, మా ఇల్లాలికి దేనికోసమైనా పంతం పట్టటమంటే మహా సరదా...అలాంటి సరదాలను ఆవిడవచ్చిన ఈఆరు నెల్లలోనూ అనేకము చెల్లించుకొంది కూడాను!

ఇవాళ ఏం పంతం పడుతుందో కొంపతీసి!...చక్కగా స్ట్రాంగు కాఫీఇచ్చి, మంచి మాటలాడి, ఏం డిమాండు చేస్తుందో అని భయపడుతున్నాను. ఇంతలో నాఆలోచన్లకి బ్రేకువేస్తూ, "ఏమండోయ్!" అని మాఆవిడ కోకిల కంఠంతో నన్ను పిలిచింది.

"ఏం కమలం!" అన్నాను నేను సిగరెట్టు ముట్టిస్తూ. "ఈనెల 28వ తారీకుని...దీ...పావళిట" అంది నసుగుతూ!...

సరి! మరేం!! సంగతంతా నాకు తెల్సిపోయింది...ట్రింట్రింట్రిం మారాణీవారికి దీపావళికింగాను ఒకానొక సరికొత్త చీరకొనాలని ఆనసుగు యొక్క అంతరార్థమని వెంటనే గ్రహించాను.

నాఒళ్ళు మండుకొచ్చింది.

"అవును...28వ తారీకుని దీపావళేనట...ఆనాడు వినాయకచవితి కాజాలదు" అన్నాను నేను వెటకారంగా!...

మాఆవిడ ఒక్కమారు తన కాటుకకళ్ళతో నావేపు తీక్షణంగాచూసి "పూహుఁ! సరే లెండి" అనేసి, ధరాలున తోకతొక్కిన త్రాచులా గదిలోకి పరిగెట్టింది...వంటింట్లోంచి బంగాళాదుంపలు మాడిపోతున్న వాసనవస్తున్నాది ... సచ్చాంరా దేవా, ఇకవూరుకొంటే లాభంలేదనిస్సి గదిలోకి వెళ్ళాను, కమలాన్ని బతిమాలడం కోసమని...

"ఏం కమలం! ఎందుకాకోపం, చెప్పవ్?"

"మరి, ఎప్పుడూ వెటకారాలేనా ఏమిటి??"

"మరి...రాబోయే దీపావళికి ఇప్పట్నుంచి సరదాగా వుండొద్దూ!"

"నాకేం సరదాలున్నాయ గనుక..."

"పోనీ, నీసరదా ఏమిటో చెప్పరాదూ!"

తనసోద చెప్పడం మొదలెట్టింది.

"పూఁ...మరే...మనపొరుగు యశోద దీపావళికని...కొత్త చీర కొనుక్కుంది.....చ...క్కా...ను..."

అందుచేత, తనుకూడా ఒకచీర కొనాలి... అదీసంగతి... నాకు నిజంగా మహాకోపంవచ్చింది.

"కమలం! నీకు రెండుపెట్టెల సిల్కుచీరలు కొన్నానుకదా...మళ్ళీ మరొకటెందుకు చెప్పు..."

"సరేలెండి! మీరిలా అంటారని నాకు తెలీదూ!"

"అయితే ఏడువు! ముమ్మాటికి నీకు చీర కొననుగాక కొనను ... కొనను ... కొనను ..." అనేసి, గభాలున గదిలోంచి వచ్చేశాను ... కాని,

మళ్ళీ, ఇలా ఎందుకన్నానా అని విచారించాను...కాని, ఎలాగయినా మాకమలం పంతము నెగ్గకుండా చేయాలని నిశ్చయించాను...

రాత్రి ఎనిమిదయింది ... మాకమల వంట సాధారణంగ పదిగంటలలోపున అవదు. సడన్‌గా

నట్టింట్లో కంచాలచప్పుడు వినవచ్చింది...అది భోజనానికి రెమ్మన్న సిగ్నలై యుంటుంది!...మాఆవిడగారు ఇంక నాతో మాట్లాడదు కాబోలు!!

...మెల్లిగా నట్టింట్లోకి వెళ్ళాను ... ఆశ్చర్యం!...అప్పికే వడ్డించేసింది...కూచుని, గబగబా భోంచేశాను...గదిలోకి వచ్చేటప్పటికి టేబిలుమీద తాంబూలం, సిగరెట్లు సిద్ధంగావున్నాయి ... తాంబూలముసేవించి, గబగబా పక్కమీదకెళ్ళి, నిద్రపోతున్నట్టు నటించాను. మాఆవిడ చక్కబొట్టు పూర్తిచేసుకొని, నుదుటను రెండంగుళాల మందాన సొంటిరసము యెత్తుకొని, నామంచానికి దూరంగా, నేలమీద పడుక్కుంది....!....' దానియిష్టం వచ్చినంత సొంటిరసం మెత్తుకోమను....కావలిస్తే రేపు రెండు వీశల సొంటికొని పారేస్తానుకొని, దీపావళికయి చీరకొనకూడదు'' అని నాలో నేను నిశ్చయించుకొన్నాను!

రెండురోజు లిలాగే మౌనవ్రతాలతో గడిచాయి...ఇద్దరి పంతాల్లోను, ఎవరిపంతం నెగ్గుతుందో తుదముట్టా చూడాలనుకున్నాను....

ఆవేళ ఆదివారం....దీపావళి మరిరెండురోజులుంది...ఆరెండురోజులు ఇలాగే గడిచాయంటే నా పంతమే నెగ్గుతుందనమాట!...లేకపోతే...ఈ ఆడవాళ్ళకి మరి పస్లేదన్నట్టు, పండుగవచ్చేసరికి కొత్త చీరలు, నగలు హాజరుకావాలట!...ఏం చవక!!

పుదయం 9 గంట అవ్వొస్తున్నాది...నేను పేపరు చదువుకుంటున్నాను....ఇంతలో మాఆవిడ మెల్లిగా నాదగ్గరికి వచ్చింది. నేనుమాత్రం ఆమె వేపు చూడలేదు,

''ఏ...మం...డీ!'' అంది మెల్లిగా, నూతులోంచి మాట్లాడుతున్నట్టు.

''ఊఁ! ఏమిటి'' అన్నాను ముక్తసరిగా...

''మాపుట్టింటికి వెళ్తున్నాను''

''ఎప్పుడు'' అన్నాను 'ఎందుక' నడానికి బదులు!

''ఇవాళసాయంత్రం (ట్రెయినులో...''

''పర్సులోని 10 రూపాయిల నోటుతీసుకో...రానూపోనూ ఖర్చులకి'' అన్నాను...

ఛంగున బంతిలాగ ఎగిరి పర్సులోని నోటు తీసి జాకెట్ లో దాచింది.

''కమలా'' అనిపిలిచాను....

''వూ! ఏమండీ'' అందినవ్వుతూ...

''ఇవాళ... నేను నీతో స్టేషనుకి రాలేనే'' అని పెద్దకోతకోశాను.

ఆవిడగా రొక్కనిమిషం ఆలోచన వభినయించి, ''ఎదురింటి రమణమ్మగారు స్టేషనుకి వెళ్తారట....వాళ్ళబండిలో వెళ్తానయితే'' అంది గడుసుగా!

...సాయంకాల మవవొస్తున్నాది ... మా ఆవిడ వంటచేసి, నాకు మూతపెట్టింది...ప్రయాణపు దుస్తులధరించి, చిన్న హేండుబేగ్ పట్టుకొని కమలం నాదగ్గరికి వచ్చింది.

''రమణమ్మగారింటికి బండొచ్చేసింది ... నేనింక వెళతాను...మీకు అన్నము మూతపెట్టాను...రాత్రికి భోంచెయ్యండి'' అంది...

''వూఁ జాగ్రత్తగా వెళ్ళిరా'' అన్నాను.

కమలం వెళిపోతూవుంటే నాకెంతో జాలి, విచారం కలిగాయి...

''కమలం! చీరకొంటాను...పుట్టింటికివెళ్ళక' అని అందామనుకొన్నానుగాని, నాపంతం ఓవేపు నుండి Refuse చెయ్యమంది.

ఒక్కణ్ణీ అలాగే కూచున్నాను. ఏమీ పూనుపోలేదు...కమలం లేకపోవడమే ఈచికాకులూ,

బద్ధకాలూ, తదితర రోగకారణం అనుకొని వూరుకున్నాను!!...ఏమైనా కమలం పంతం నెగ్గకుండా చెయ్యాలి!

గంటగడిచింది ... ఏమిచెయ్యడానికి బుద్ధి పుట్టలేదు...సిగరెట్టుమీదసిగరెట్టు కాల్చి వేస్తున్నా!

రాత్రి అవవస్తున్నాది...నారిస్టువాచీలో 8 అయింది ... ఇంకా, ఏదో ఆలోచిస్తూ అలాగే కూచున్నా...

వీధితలుపెవరో కొట్టినట్లయింది. గాలివల్ల అనుకున్నాను...మళ్ళీ చప్పుడయింది...తలుపుతియ్యడానికి లేచాను...

తలుపుతీద్దునూ...ఆశ్చర్యం!...కమలం ఎదురుగా నుంచునివుంది ... ఏదో పోయిన విలువైన వస్తువు తిరిగి దొరికినట్టు Feel అయాను.

“ఏం కమలం!....వెళ్ళలేదూ?”

“ట్రెయినుకి అందలేక పోయాం”

“అరరే!” నిజానికి ఆమె తిరిగిరావడం నాకు సంతోషంగా నేవుంది...కమలంకూడా అలక మానిస్సి, సరదాగా నే వున్నట్టుంది...Thank God అనుకున్నాను లోలోపల...

....మర్నాడుపొద్దున్న చక్కగా ఇడ్లీలు, కాఫీ చక్కా బెట్టిందినాకు ... కులాసాగా కబుర్లు చెప్పిందికూడాను....తనకి చీరకొనలేదని మొదటఅడిగిన కమలం ఇలాగ మారిపోయిందేమిటా అనుకున్నాను... చీరవూసుకూడా ఎత్తలేదు కమలం!...

దీపావళివచ్చేసింది...ఇస్త్రీ బట్టలు వేసుకొని, టేబిలుముందు కుర్చీలో కూచున్నాను ... కమలం వుప్మా, కాఫీ, తెచ్చి టేబిలుమీద వుంచింది.

నాచెయ్యి వుప్మాప్లేటుమీదికి పోయిందికాని, నారెండుకళ్ళు అప్రయత్నంగా కమలం కట్టుకొన్న సరికొత్త పువ్వుల చీరమీదకి పోయాయి.

“అలా చూస్తారేమిటండీ ... ఫలహారం కానియ్యండి” అంది మాకమలం విరగబడినవ్వుతూ.

“అరె! అకొత్త చీరెక్కడిదీ” అన్నా ఆశ్చర్యంగా. మాకమలం మరింత నవ్వడం మొదలు పెట్టింది.

“అనవ్వేమిటీ, చీర ఎక్కడిదంటేను?” అని వుడుకుబోతుతనంగా అడిగాను.

“కొనుక్కున్నానండీ!” మీరు డబ్బు చిత్తగిస్తేనూ !!

“తొందరపడకండి ... ట్రెయిను ఖర్చులకని మీరు పదిరూపాయి లివ్వగలరుకాని, ఒకచీర కొనలేరూ?...అందుకే....ఆ 10 రూపాయలూపెట్టి చీర కొనుక్కున్నాను చక్కగా....లేకపోతే మాపుట్టింటికప్పుడే పరుగెడతాననుకొన్నారా ... అసలు ఎవరి పంతంగెల్చిందో చెప్పండిప్పుడు!” అని విరగబడి పకపకానవ్వడం ప్రారంభించింది ... “ఓ .... ఓసి వగలాడి !!” అన్నాను నేను తెల్లమొహంవేసి!

మాకమలం యింకా విరగబడి నవ్వుతూనే వుంది!


## ఈశ్వర్స్

### రత్న పురుష లేహ్యం

శుక్ల నష్టము, మలబద్ధము, నరముల బలహీనత, నీరసము తగ్గించి బలము, కండపుష్టి, రక్తము, వీర్యవృద్ధి నిచ్చును.

## గనోక్వెల్

అన్ని సెగలను అద్భుతముగ తగ్గించును. ఇతర ఔషధములకు లోబడనికేసులలో సహితము యిది కుదుర్చును. మూత్రనాళిమందలి మంట, రసికంటి చెడ్డనీరు స్రవించుట అద్భుతముగ తగ్గించును.

## కుముద

స్త్రీల తెల్ల, ఎఱ్ఱకుసుమలు, అకాలబహిష్ట, బుతుశూలల, వెన్నునొప్పి, గుండెనొప్పి తగ్గించును. బుతురక్తమును జారీచేయును. గర్భపాతమును కాకుండచేయును.

అన్ని గొప్ప మందులషాపులయందును దొరకును.

## ఈశ్వరఫార్మసీ

మద్రాసు.